సాక్షి అనంతపురం

ఆదివారం । 4 । జూన్ । 2023



నెల పూజోత్సవం

పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి నెల పూజోత్సవం శనివారం వైభవంగా జరిగింది. 10లో



మరింత చేరువగా ఆధార్

ఆధార్ నమోదు, నవీకరణ సేవలను ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చర్యలు చేపట్టింది. 10లో

గరిష్టం/కనిష్టం
39.0°/27.0°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. మధ్యాహ్నం వరకు వేసవితాపం, ఉక్కపోత అధికంగా ఉంది.

న్యూస్‌రీల్

డీపీఓ ఉమామహేశ్వరమ్మ బాధ్యతల స్వీకరణ



నూతన డీపీఓకు అభినందనలు తెలియజేస్తున్న అధికారులు

అనంతపురం సెంట్రల్: నూతన జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇదివరకు ఇక్కడ డీఏఓగా పనిచేసిన చంద్రానాయక్, వ్యవసాయశాఖ సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. చంద్రానాయక్ రిలీవ్ అయ్యి బాధ్యతలను ఆమెకు అప్పగించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంకు చెందిన ఉమామహేశ్వరమ్మ తొలుత అదే జిల్లాలో ఏఓగా నియమితులయ్యారు. అనంతరం తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట, వెస్ట్ గోదావరి జిల్లా పాలకొల్లు ఏడీగా పనిచేశారు. వరంగల్ డీడీఏగా, అనంతరం జేడీఏగా వరంగల్, రంగారెడ్డి, కర్నూలు, కడప, అన్నమయ్య జిల్లాల్లో పనిచేశారు. తాజాగా బదిలీపై అనంతపురం డీఏఓగా నియమితులయ్యారు.

ప్రశాంతంగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష



జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షల తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష తొలిరోజు శనివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 522 మంది అభ్యర్థులకు గానూ 402 మంది హాజరయ్యారు. 120 మంది గైర్హాజరయ్యారు. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ గౌతమి పరిశీలించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. నిర్దేశిత సమయం దాటిన తరువాత అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించకూడదని ఆదేశించారు. కలెక్టర్ వెంట డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు ఉన్నారు.

అదనంగా వసూలు చేస్తే డీలర్‌షిప్ రద్దు

- గ్యాస్ ఏజెన్సీలకు జేసీ కేతన్‌గార్గ్ హెచ్చరిక



రికార్డు పరిశీలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: గ్యాస్ సిలిండర్‌ను ఇంటికి సరఫరా చేసే క్రమంలో నిర్దేశించిన రుసుము కంటే అదనంగా వసూలు చేస్తే సంబంధిత ఏజెన్సీల డీలర్‌షిప్ రద్దు చేస్తామని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ హెచ్చరించారు. 'స్పందన'లో వచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం సాయంత్రం నగరంలోని నరసింహ గ్యాస్ ఏజెన్సీ (ఇండేన్ గ్యాస్)ని జేసీ తనిఖీ చేశారు. అలాగే కురుగుంట సమీపంలో ఆ ఏజెన్సీకి చెందిన గోడౌన్‌ను తనిఖీ చేసి స్టాక్ రికార్డును పరిశీలించారు. సిలిండర్ డోర్ డెలివరీకి నిర్దేశించిన రుసుము కంటే ఎక్కువ వసూలు చేయకూడదని జేసీ స్పష్టం చేశారు. డెవరీ బాయ్స్ చేసే తప్పిదాలకు ఏజెన్సీ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలను గ్యాస్ ఏజెన్సీలు విధిగా పాటించని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ కుశాల్ జైన్, డీఎస్‌ఓ శోభారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాలేజీ.. సీటేది!

- పోటీ పరీక్షల ర్యాంకుతో మంచి బ్రాంచ్‌లో సీటు వచ్చేనా?
- ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరికలపై తర్జనభర్జన
- ఉమ్మడి జిల్లాలో 12 కాలేజీలు.. 8వేలకు పైగా ఇంజినీరింగ్ సీట్లు
- ఇంటర్మీడియెట్ పాసైన విద్యార్థులు దాదాపు 17 వేల మంది
- తమిళనాడు డీమ్డ్ యూనివర్సిటీలకు పరుగులు



ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఇంటర్ పాసైన వారి వివరాలు	
పరీక్షలు రాసిన అబ్బాయిలు	11,609
పాసైన అబ్బాయిలు	7,278
పరీక్షలు రాసిన అమ్మాయిలు	13,517
పాసైన అమ్మాయిలు	9,665
మొత్తం పాసైన వారు	16,943

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాలలు	
ప్రభుత్వ కాలేజీలు	2
ప్రైవేటు కాలేజీలు	10
మొత్తం ఇంజినీరింగ్ సీట్లు	8,100

సాక్షి ప్రతినిధి అనంతపురం: ఇంటర్మీడియెట్‌లో మంచి మార్కులు సాధించారు. ఏపీ, ఇతర రాష్ట్రాల్లోని విద్యా సంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశానికి సంబంధించిన అర్హత పరీక్షలు రాశారు. అందులో వచ్చిన ర్యాంకుతో తాము కోరుకున్న కళాశాలలో సీటు వస్తుందా.. లేక ప్రత్యామ్నాయం చూసుకోవాలా.. అన్న సందేహాలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తర్జనభర్జన పడుతున్నారు. మంచి ప్లేస్‌మెంట్లు కావాలనుకుంటున్న పలువురు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు వెళ్లి డీమ్డ్ యూనివర్సిటీలను సైతం పరిశీలించి వస్తున్నారు.

మంచి ప్లేస్‌మెంట్ కోసం...

మంచి ప్లేస్‌మెంట్ రావాలంటే మంచి కాలేజీలో చేరాలి. మంచి కాలేజీలో అంటే మంచి ర్యాంకు రావాలి. నచ్చిన కోర్సు కావాలంటే మంచి కాలేజీ కుదరదు, కాలేజీ బావుందనుకుంటే కావాల్సిన సీటు లేదు.. ఇదీ తంటా. దీంతో చాలామంది విద్యార్థులు తమిళనాడులోని డీమ్డ్ యూనివర్సిటీల బాటపడుతున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు కర్ణాటక దగ్గరగా ఉండటంతో కోమెడ్ కే (ఏపీలో ఎంసెట్ తరహా టెస్టు) రాసి అక్కడ చేరుతున్న వారూ ఉన్నారు. జేఈఈ మెయిన్స్‌లో మంచి పర్సెంటైల్ సాధించిన విద్యార్థులు కర్ణాటకలోని సూరత్‌కల్, తెలంగాణలోని వరంగల్ నీట్ తదితర సంస్థలను ఎంచుకుంటున్నారు.

మధ్యతరగతికి తప్పని కష్టాలు

ఇంజినీరింగ్ కోర్సు ఖరీదైంది. ఇది మధ్యతరగతికి పెద్ద భారంగా పరిణమించింది. ఓ మోస్తరు కాలేజీలో చేరదామన్నా హాస్టల్‌తో కలిపి ఏడాదికి రూ.3 లక్షలకు తక్కువ లేదు. ఇక తమిళనాడులోని శస్త్ర, సత్యభామ, అమృతానందమయి, 'విట్' వంటి కాలేజీల్లో కోర్సు పూర్తయ్యేసరికి రూ.16 లక్షలపైనే అవుతోంది. దీంతో మధ్యతరగతి కుటుంబాలు మదనపడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో అయితే ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం ప్రభుత్వమే చేస్తుంది. కానీ దూరపు కొండలు నునుపు అన్నట్టు బయటి రాష్ట్రాల్లో చదువులకు విద్యార్థులు ఎగబడుతున్నారు. ఈ నెల నాలుగో తేదీన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఉండటంతో మరికొంతమంది అదృష్టం పరీక్షించుకోనున్నారు.

మా బాబును డిగ్రీలో చేరుస్తున్నాం



మా కొడుకు ఉదయ్ సాయిది ఈ సంవత్సరం ఇంటర్మీడియెట్ అయిపోయింది. మొదట ఇంజినీరింగ్ చేయించాలనుకున్నాం. కానీ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో డిగ్రీ విద్యను ప్రోత్సహిస్తుండటంతో మేము డిగ్రీ వైపు మొగ్గు చూపాము. పిల్లలను ఏ కోర్సులో చేర్పించాలా అన్నది చాలా కష్టంగా ఉంది. సీటు వచ్చేవరకు మాలాంటి వాళ్లకు ఇబ్బందిగా ఉంటుంది.
–ఎం.భారతి, గృహిణి, వేణుగోపాల్‌నగర్, అనంతపురం

అన్ని సదుపాయాలూ ఉన్న కళాశాలే మేలు



కోర్సు కన్నా కళాశాల ఎంపిక కీలకం. మౌలిక సదుపాయాలు, నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్న కళాశాలలను గుర్తించాలి. బ్రాంచ్ కన్నా కళాశాల రాణింపు ముఖ్యం. మూడేళ్లుగా క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికైన విద్యార్థులు, అధ్యాపకుల అర్హతలు, గ్రంథాలయం, ల్యాబ్ సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే కళాశాలను ఎంపిక చేసుకోవాలి. రానున్న రోజుల్లో మల్టీడిప్లినరీ కోర్సులు రానున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని వనరులూ కలిగిన కళాశాలను ఎంపిక చేసుకోవడమే ఉత్తమం.
– డాక్టర్ రామచంద్ర,ప్రిన్సిపాల్, ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాల

కోర్ బ్రాంచ్‌ల్లో అపార అవకాశాలు



కోర్ బ్రాంచుల్లో అవకాశాలు అపారంగా ఉంటాయి. తొలుత జీతం తక్కువైనప్పటికీ, అనుభవం వచ్చే కొద్దీ జీవితంలో స్థిరపడే అవకాశాలు ఉంటాయి. అయితే ఏ కళాశాలలో చదివితే అవకాశాలు అధికంగా ఉన్నాయో బేరీజు వేసుకోవాలి. నేరుగా కళాశాలను సందర్శించి అన్ని వసతులూ ఉన్నాయా? లేదా? పరిశీలించాలి. పూర్వ విద్యార్థులతో ఆరా తీయాలి. విద్యార్థికి నచ్చిన బ్రాంచ్‌ను తీసుకునే స్వేచ్ఛ తల్లిదండ్రులు ఇవ్వాలి. అప్పుడే కోర్సు పూర్తి చేయాలనే శ్రద్ధ కలుగుతుంది.
– కేశవరెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్, జేఎన్‌టీయూ(ఏ)

'నితిన్‌సాయి' దౌర్జన్యకాండ

- నిబంధనలకు విరుద్ధంగా మొబైల్ క్రషర్ల ఏర్పాటు
- నాసిరకం కంకరతో రోడ్డు పనులు
- తనిఖీకి వెళ్లిన అధికారులను అడ్డుకున్న సిబ్బంది

ధర్మవరం: 'నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్' సిబ్బంది దౌర్జన్యానికి దిగారు. తనిఖీలకు వెళ్లిన అధికారులను అడ్డుకున్నారు. తమకు అన్ని అనుమతులూ ఉన్నాయని బుకాయిస్తూ అధికారులను అక్కడి నుంచి వెళ్లగొట్టారు. వివరాల్లోకి వెళితే...మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరికి చెందిన నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ముదిగుబ్బ బైపాస్ రోడ్డు పనులు చేస్తోంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా మొబైల్ క్రషర్ ద్వారా నాసిరకం కంకరను రోడ్డు పనులకు వినియోగిస్తోంది. దీనిపై కొందరు ఫిర్యాదు చేయగా, శనివారం శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లా విజిలెన్స్, భూగర్భ గనుల శాఖ అధికారులు తనిఖీలకు వెళ్లారు. అయితే కంపెనీ ప్రతినిధులు తమ అక్రమాలు ఎక్కడ బయట పడతాయోనన్న భయంతో రౌడీ మూకలను అడ్డుగా పెట్టి అధికారులపై దౌర్జన్యం చేశారు. తాము కేవలం కంకర నాణ్యతను పరిశీలిస్తామని చెప్పినా వినిపించుకోలేదు. దీంతో విజిలెన్స్ ఏడీ విజయలక్ష్మి కంకర ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారని 'నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్' సిబ్బందిని ప్రశ్నించగా, వారు సమాధానం ఇవ్వలేదు. పోనీ మొబైల్ క్రషర్‌కు సంబంధించిన అనుమతి పత్రాలు ఇవ్వాలని కోరినా నిరాకరించారు. పైగా తమ అనుచరులను పోగేసి హంగామా చేసి అధికారులపైకి దౌర్జన్యానికి దిగారు. దీంతో భయాందోళన చెందిన అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు.



విజిలెన్స్ ఏడీ విజయలక్ష్మిని అడ్డుకుంటున్న వరదాపురం సూరి అనుచరులు

గతంలోనూ అనేక అక్రమాలు

మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరికి చెందిన క్రషర్లలో గతంలోనూ అనేక అక్రమాలు జరిగాయి. భూగర్భ గనుల శాఖ, విజిలెన్స్ అధికారులు భారీ జరిమానాలు కూడా విధించారు. కానీ తీరు మార్చుకోని సదరు కంపెనీ యాజమాన్యం ధనార్జనే ధ్యేయంగా తప్పుల మీద తప్పులు చేస్తూ వెళ్తోంది.

అక్రమాలు తేలితే కఠిన చర్యలు

నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ కస్తూర్బా గాంధీ స్కూల్ నుంచి మలకవేముల వరకు చేపడుతున్న ముదిగుబ్బ బైపాస్ రోడ్డు పనుల్లో అక్రమాలు జరుగుతున్నాయని మా దృష్టికి వచ్చింది. మొబైల్ క్రషర్‌ల ద్వారా నాసిరకం కంకర, ఇతర సామగ్రిని రోడ్ల నిర్మాణానికి వినియోగిస్తున్నారని కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో మేము తనిఖీలకు వెళ్లగా కొంతమంది అడ్డుకున్నారు. ఇందుకు సంబంధించి కంపెనీ ప్రతినిధులకు నోటీసు జారీ చేస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం.
– విజయలక్ష్మి, విజిలెన్స్ ఏడీ

స్కూళ్లకు చేరుతున్న 'విద్యాకానుక'

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ కిట్లు
- వంద శాతం చేరిన బెల్టులు, యూనిఫాం, బ్యాగులు, డిక్షనరీలు
- బడి మొదలైన రోజే ప్రతి విద్యార్థికీ కిట్లు అందించేందుకు చర్యలు

రాప్తాడురూరల్: ప్రభుత్వ విద్య పటిష్టతకు సీఎం జగన్ అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 1-10 తరగతుల పేద విద్యార్థుల కోసం జగనన్న విద్యా కానుక (జేవీకే) కిట్లు అందజేస్తున్నారు. 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు కిట్లు అందజేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఇందుకోసం రాష్ట్రస్థాయి అధికారుల నుంచి పాఠశాల స్థాయి హెచ్‌ఎం వరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే చాలా వరకు మండల పాయింట్లకు కిట్లు చేరాయి. అక్కడి నుంచి పాఠశాలలకు సరఫరా శనివారం నుంచి మొదలైంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2,18,983 మంది 1-10 తరగతుల విద్యార్థులు చదువుతున్నారు. కిట్లలో మూడు జతల యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, 6-10 తరగతుల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, రెండుజతల సాక్సులు, ఒక జత బూట్లు, బెల్టు, స్కూల్ బ్యాగ్, ఆక్స్‌ఫర్డ్, పిక్టోరియల్ డిక్షనరీలు ఉంటాయి. మండల కేంద్రాల్లోని స్టాక్ పాయింట్లకు యూనిఫాం, బ్యాగులు, డిక్షనరీలు, బెల్టులు వంద శాతం చేరాయి. సాక్సులు 65,980 మంది విద్యార్థులకు, పాఠ్యపుస్తకాలు 15,62,777 టైటిళ్లు అవసరం కాగా ఇప్పటిదాకా 6,05,822 చేరాయి. వచ్చినవాటన్నింటినీ కిట్లుగా రూపొందించి స్కూల్ పాయింట్లకు పంపుతున్నారు. మండల పాయింట్ల నుంచి స్కూల్ పాయింట్లకు రవాణా బాధ్యత మండల విద్యాశాఖ అధికారులదే. ఇందుకు సంబంధించిన బిల్లులను ఎంఈఓలకు మంజూరు చేస్తారు.



నార్పల మండల కేంద్రం నుంచి పాఠశాలకు తరలిస్తున్న జేవీకే కిట్లు

కమిటీల ఆమోదం తప్పనిసరి

జగనన్న విద్యా కానుకలోని వస్తువుల నాణ్యతపై గతంలో అక్కడక్కడా వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం ఈసారి మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. ఏ ఒక్క విద్యార్థికీ ఒక్క వస్తువు కూడా తక్కువ కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఇందుకోసం మండల స్థాయిలో క్వాలిటీ, డిస్ట్రిబ్యూషన్ కమిటీలను నియమించింది. వస్తువుల నాణ్యత, విద్యార్థుల సంఖ్యకు సరిపడేలా ఈ కమిటీలు ఆమోద ముద్ర వేసిన తర్వాతనే స్కూళ్లకు తరలిస్తున్నారు. భవిష్యత్తులో ఏదైనా ఆరోపణలు వచ్చినా ఈ కమిటీలు పూర్తిగా బాధ్యత వహించాల్సి ఉంటుంది.

స్కూల్ ప్రారంభం నాటికి కిట్లు సిద్ధం

గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫాం మాత్రమే విద్యార్థులకు ఇచ్చేవారు. ఇవికూడా ఏ ఒక్క సంవత్సరం బడులు ప్రారంభం నాటికి ఇచ్చిన దాఖలాలు లేవు. అరకొర ఇస్తూ ఏడాదంతా గడిపేవారు. విద్యా సంవత్సరం ముగిసే సమయంలో పాఠ్యపుస్తకాలు అందుకున్న విద్యార్థులు ఎందరో. జగన్ సర్కారు ఈ విషయంలో ఎక్కడా రాజీపడలేదు. బడులు తెరిచే నాటికి విద్యార్థులు చేతుల్లో జగనన్న విద్యా కానుక కిట్లు అందిస్తోంది. అదికూడా పాఠ్యపుస్తకాలు, 3 జతల యూనిఫాంతో పాటు అదనంగా మరో 5 వస్తువులను అదనంగా అందిస్తున్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

అనంతపురం అర్బన్: ఒడిశాలో శుక్రవారం రాత్రి కోరమాండల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, హౌరా ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రయాణికులు పెద్ద సంఖ్యలో దుర్మరణం చెందారని, వందలాదిమంది ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో చిక్కుకున్న తమ బంధువులు, కుటుంబ సభ్యుల సమాచారం తెలుసుకోవడానికి అనంతపురం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఎం.గౌతమి శనివారం తెలిపారు. ల్యాండ్ లైన్ 08554-2200009, మొబైల్ 8500292992 నంబర్లకు ఫోన్‌చేసి తమ వారి సమాచారం పొందవచ్చన్నారు. దీంతో పాటు మెయిల్ ఐడీ cccantp @gmail.com ద్వారానూ సమాచారాన్ని తెలుసుకోవచ్చని కలెక్టర్ సూచించారు.

జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో హెల్ప్‌డెస్క్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటైంది. ఒడిశా రైలు ప్రమాదంలో అనంతపురం జిల్లా వాసులు ఎవరైనా చిక్కుకుని ఉంటే వారి సహాయార్థం ఈ డెస్క్‌ను ఏర్పాటు చేశామని ఎస్పీ కె.శ్రీనివాసరావు తెలిపారు. సమాచారం కోసం 08554 240241, అదనపు ఎస్పీ 94407 96801 నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు కళ్యాణదుర్గానికి మంత్రి పెద్దిరెడ్డి రాక

కళ్యాణదుర్గం: పట్టణంలో ఆదివారం నిర్వహించే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమ ముగింపు సభ, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్సవ సభకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరు కానున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

గృహ నిర్మాణాల్లో నిర్లక్ష్యం వద్దు

- జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న భాస్కరరెడ్డి

కూడేరు: జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని, ఈ విషయంగా నిర్లక్ష్యం వీడాలని సంబంధిత అధికారులను జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి ఆదేశించారు. శనివారం కూడేరులోని జగనన్న కాలనీలో ఆయన పర్యటించారు. మండల వ్యాప్తంగా 1,335 గృహ నిర్మాణాలు మంజూరు కాగా, 671 పూర్తియ్యాయని, మరో 600 గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని ఈ సందర్భంగా ఆయనకు హౌసింగ్ ఏఈ శేఖర్ వివరించారు. నిర్మాణాలు చేపట్టని వారి పట్టాలు రద్దు చేయాలని ఈ సందర్భంగా మండల అధికారులకు జెడ్పీసీఈఓ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ముస్తఫా కమల్‌బాషా, ఏపీఓ తులసీప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రఘు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

లోలూరులో వైద్యాధికారుల పర్యటన


స్థానికులతో మాట్లాడుతున్న వైద్యాధికారి

శింగనమల: మండలంలోని లోలూరులో శనివారం ఉదయం వైద్యాధికారులు పర్యటించారు. డెంగీ జ్వరంతో బాధపడుతూ శుక్రవారం సాయంత్రం లోలూరుకు చెందిన చిన్నారి ప్రవీణ్‌కుమార్ మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా మలేరియా సబ్‌యూనిట్ అధికారులు మద్దయ్య, బాషా, శ్రీధర్, సీహెచ్‌ఓ శివప్రసాద్, ఎంపీహెచ్‌ఓలు గోవిందు, రమణ, సూపర్ వైజర్ సుధాకర్, అశ్వత్థ, పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులు, అరుణకుమారి, ఏఎన్‌ఎం ప్రమీల, ఆశ వర్కర్లు శనివారం ఉదయం ఆ గ్రామానికి చేరుకుని ఇంటింటికెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. దోమల నివారణకు గ్రామంలో క్రిమి సంహారక మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా విష జ్వరాలపై ప్రజలను చైతన్యపరిచారు.

మరింత చేరువగా ఆధార్

- ఇప్పటికే 120 సచివాలయాల ద్వారా సేవలు
- త్వరలో సచివాలయాలకు ట్యాబ్‌లు
- ప్రజల వద్దకే వెళ్లి మూడు రకాల ఆధార్ సేవలు అందించేలా జగన్ సర్కార్ చర్యలు
- ఇప్పటికే ఎన్‌ఎస్‌ఈఐటీ సర్టిఫికెట్ పొందిన కార్యదర్శులు



అనంతపురం అర్బన్: ప్రజలకు సత్వర సేవలందించే విషయంలో జగన్ సర్కార్ ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పట్లో ప్రతి ఒక్కరికీ ఆధార్ అత్యంత ప్రధాన డాక్యుమెంట్‌గా మారింది. అయితే ఆధార్‌ను అప్‌డేషన్ చేయించుకునేందుకు బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొనడంతో చాలా మంది ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో ప్రజలకు ఆధార్ సేవలను చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరింత బాధ్యత తీసుకుంది. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, అప్‌డేషన్‌కు సంబంధించి ఇప్పటి వరకూ సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజల ఇంటి వద్దకే తీసుకెళ్లేలా చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ప్రతి సచివాలయానికి ఓ ట్యాబ్‌ను అందజేస్తోంది. అర్బన్ ప్రాంతాల్లో ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి, రూరల్ ప్రాంతాల్లో డిజిటల్ అసిస్టెంట్ నేరుగా ప్రజల వద్దకు వెళ్లి మూడు రకాల ఆధార్ సేవలను అందించే కార్యక్రమానికి జిల్లా అధికారులు త్వరలో శ్రీకారం చుట్టనున్నారు.

ట్యాబ్ ద్వారా అందించే సేవలివే..

ప్రజల ఇళ్ల వద్దకు సచివాలయ ఉద్యోగి స్వయంగా వెళ్లి ట్యాబ్ ద్వారా చైల్డ్ ఎన్‌రోల్‌మెంట్, డాక్యుమెంట్ అప్‌డేషన్, ఫోన్ నెంబర్ లింక్ సేవలను అందించనున్నారు. అప్‌డేషన్‌కు నిర్ణీత రుసుం ప్రజలు చెల్లించాల్సి ఉంటుంది. ఆధార్ సేవలు అందించే వ్యక్తులు తప్పనిసరిగా ఆధార్ ఆపరేటర్ పరీక్ష (ఎన్‌ఎస్‌ఈఐటీ - నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉత్తీర్ణత సాధించి సర్టిఫికెట్ పొంది ఉండాలి. జిల్లాలో 663 గ్రామ, వార్డు సచివాలయాలుండగా ఇప్పటి వరకూ 475 మంది వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి, గ్రామ డిజిటల్ అసిస్టెంట్లు ఈ అర్హత సాధించారు. మిగిలిన వారు త్వరలో పరీక్ష రాయనున్నారు.

సచివాలయాల్లో ఆధార్ సేవలు ఇలా...

జిల్లా వ్యాప్తంగా 120 గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ ప్రక్రియ ప్రారంభమైన 2021, జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకూ 1,80,159 సేవలను సచివాలయ ఉద్యోగులు అందించారు. ఇందుకు రుసుం రూపంలో రూ.64,25,760 ప్రభుత్వ ఖజానాకు జమ అయింది. 0-5 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలకు చైల్డ్ ఎన్‌రోల్‌మెంట్ ఉచితంగా చేస్తారు. డాక్యుమెంట్ అప్‌డేషన్ ఆన్‌లైన్‌లో రూ.25, ఆఫ్‌లైన్‌లో రూ.50 తీసుకుంటారు. బయోమెట్రిక్ (వేలి ముద్రలు) అప్‌డేషన్‌కు రూ.100 చెల్లించాలి. డెమోగ్రాఫిక్ అప్‌డేషన్‌కు రూ.50, చిరునామా మార్పు, పుట్టిన తేదీ సవరణ, పేరు సవరణ, ఫోన్ నెంబర్ లింక్, ఐడీ అప్‌డేషన్ సేవలకు రూ.50 చార్జీ చెల్లించాల్సి ఉంటుంది.

సేవలు మరింత చేరువ



ప్రజలకు ఆధార్ సేవలు మరింత చేరువ చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రజల చెంతకే వెళ్లి ఆధార్ సేవలు అందించేలా ప్రతి సచివాలయానికి ఓ ట్యాబ్‌ను ప్రభుత్వం ఇవ్వనుంది. సచివాలయ ఉద్యోగి ప్రజల వద్దకే వెళ్లి ట్యాబ్ ద్వారా చైల్డ్ ఎన్‌రోల్‌మెంట్, డాక్యుమెంట్ అప్‌డేషన్, ఫోన్‌నెంబర్ లింక్ సేవలను అందిస్తారు.

– కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

సచివాలయాల్లో ఆధార్ సేవలిలా...	
సేలందిస్తున్న సచివాలయాలు	120
అందించిన సేవలు మొత్తం	1,80,159
న్యూ ఆధార్ ఎన్‌రోల్‌మెంట్	14,059
తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ (వయసు 5-7 ఏళ్ల మధ్య)	63,429
తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ (వయసు 7-17 ఏళ్ళ మధ్య)	1,804 (కొత్తగా మొదలైన సేవ)
బయోమెట్రిక్ అప్‌డేట్	24,134
డెమోగ్రాఫిక్ అప్‌డేట్	45,298
ఈ-ఆధార్	232
డాక్యుమెంట్ అప్‌డేట్	31,203
చార్జీల రూపంలో అందిన మొత్తం	రూ.64,25,760

అబార్షన్ల అంశంలో అప్రమత్తంగా ఉండండి

- పీసీపీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ యుగంధర్


శిక్షణ పూర్తి చేసుకున్న పీహెచ్‌సీ వైద్యాధికారులతో డాక్టర్ యుగంధర్

అనంతపురం క్రైం: గర్భంలో పిండం ఎదుగుదల సరిగా లేకపోవడం, జన్యుపరమైన, గుండె, సామాజికపరమైన సమస్యలతో అబార్షన్లు చేసుకునే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారులను పీసీపీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ ఆదేశించారు. మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ(ఎంటీపీ)పై పీహెచ్‌సీ వైద్యాధికారులకు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని గైనిక్ విభాగం సెమినార్ హాల్‌లో కొన్ని రోజులుగా జరుగుతున్న శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. డాక్టర్ యుగంధర్, డాక్టర్ సుచిత్ర మాట్లాడారు. మాతృ మరణాల నివారణలో భాగంగా గర్భం దాల్చి 9 వారాలు నిండిన వారికి మాత్రమే మాత్రల ద్వారా అబార్షన్ చేయాలన్నారు. అంతకు మించితే విషయాన్ని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. మాతా, శిశువులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. అనంతరం డాక్టర్ యుగంధర్ విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 45 పీహెచ్‌సీల్లో ప్రసవాలు అధికంగా జరిగే పీహెచ్‌సీలను ఎంపిక చేసి, అందులోని 33 మంది వైద్యాధికారులకు నాలుగు బ్యాచ్‌లుగా ఎంటీపీపై అవగాహన కల్పించినట్లు వివరించారు. కార్యక్రమంలో గైనకాలజిస్టు డాక్టర్ విజయలక్ష్మి, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- 20న రాత పరీక్ష

రాప్తాడు రూరల్: జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరం ప్రవేశాలకు మిగులుగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు ఎంజేపీఏపీబీసీ డబ్ల్యూ రెసిడెన్షియల్ పాఠశాలల అనంతపురం జిల్లా కన్వీనర్ పీఎంకే సంగీతకుమారి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. బాలికలకు నార్పల, డీ.హీరేహాల్, గోనబావి, బాలురకు కుందుర్పి, కొనకొండ్ల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో వివిధ కేటగిరీలకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 5 నుంచి 12వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారికి ఆయా పాఠశాలల్లో ఈ నెల 20న ప్రవేశ పరీక్ష ఉంటుంది. ప్రతిభ ఆధారంగానే విద్యార్థులను చేర్చుకుంటారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్షకు మించరాదు. 6వ తరగతిలో ఐదు సీట్లు ఖాళీలుండగా వీటిలో ఓసీ/ఈబీసీ, బీసీ-డీ కేటగిరిలోని బాలికలకు చెరో ఒకటి, ఎస్సీ కేటగిరికి రెండు, బాలుర విభాగంలో ఓసీ/ఈబీసీ, ఎస్టీ కేటగిరిలో చెరో ఒకటి చొప్పున సీట్లు కేటాయించారు. 7వ తరగతిలో బాలికల విభాగంలో ఎస్సీలకు 3, ఎస్టీలకు 2, బీసీ-ఏ, ఎస్టీలకు చెరో ఒకటి, బాలుర విభాగంలో బీసీ-ఏకు 2, బీసీ-బీ, ఎస్టీకు చెరో ఒకటి చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయి. 8వ తరగతిలో బాలిలక విభాగంలో బీసీ-ఏ, ఎస్సీ, ఎస్టీకు చెరో ఒకటి, బీసీ-బీకు 3 సీట్లు, బాలుర విభాగంలో ఓసీ/ఈబీసీ, బీసీ-ఏ, ఎస్సీకు చెరో ఒకటి, బీసీ-బీ, బీసీ-డీ, ఎస్టీకు చెరో 2 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయి. 9వ తరగతిలో బీసీ-ఏకు 4, బీసీ-బీకు 12, బీసీ-డీకు 10, బీసీకు 2, ఎస్సీలకు 7, ఎస్సీలకు 10 సీట్లు చొప్పున ఖాళీలున్నాయి. పూర్తి వివరాలకు 90008 61117 (నార్పల), 83094 83104 (గోనబావి), 78933 06450 (డీ.హీరేహాల్), 94905 00015 (కొనకొండ్ల), 63092 92018 (కుందుర్పి)లో సంప్రదించవచ్చు.

పెన్నహోబిలంలో నెల పూజోత్సవం


విశేష అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్

ఉరవకొండ రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం నెల పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు పూర్తయిన 30 రోజుల తర్వాత ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవంలో భాగంగా శనివారం వేకువజామునే శ్రీవారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు పెద్ద ఎత్తున జరిగాయి. వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఈ సందర్భంగా బళ్లారి జిల్లా శంకబండ పంచాయతీ తలమామిడి గ్రామానికి చెందిన భక్తుడు తలారి రామకృష్ణ రూ.19 వేలు విలువైన 210 గ్రాముల వెండి పూలహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.విజయ్‌కుమార్, ప్రధాన అర్చకుడు ద్వారకానాథాచార్యులు, అర్చకుడు బాలాజీస్వామి పాల్గొన్నారు.

రూ.500 కోసం గొడవ

కళ్యాణదుర్గం: అప్పుగా తీసుకున్న రూ.500 చెల్లించలేదంటూ ఓ మహిళపై దాడి చేసిన ఘటన శనివారం కంబదూరు మండలం రాళ్ల అనంతపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... రాళ్ల అనంతపురానికి చెందిన పద్మతో అదే గ్రామానికి చెందిన మంజులమ్మ తన ఇంటి అవసరాల కోసం కొన్ని రోజుల క్రితం రూ.500 తీసుకుంది. ఆ డబ్బు తిరిగి చెల్లించడంలో ఆలస్యం కావడంతో మంజులమ్మను పద్మ నిలదీసింది. ఇద్దరూ వాగ్వాదం చేసుకుంటుండగా పద్మ కుటుంబసభ్యులు మశ్చీంద్ర జోక్యం చేసుకున్నాడు. అనంతరం ఇద్దరూ కలసి దాడి చేయడంతో మంజులమ్మకు గాయాలయ్యాయి. ఆమెను కుటుంబసభ్యులు కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించి, చికిత్స చేయిస్తున్నారు. ఘటనపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

విద్యుత్ శాఖలో ఏఈల బదిలీ

అనంతపురం టౌన్: విద్యుత్ శాఖలో పలువురు అసిస్టెంట్ ఇంజనీర్లతో పాటు జూనియర్ ఇంజనీర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు చేస్తూ ఆ శాఖ ఎస్‌ఈ సురేంద్ర శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పుట్టపర్తికి నారాయణమ్మ (అనంతపురం డీ-2), గుత్తిలోని టెక్నికలవిభాగానికి శ్రీదేవి (అనంతపురం), అనంతపురం డీ1కు లక్ష్మీనారాయణ (అనంతపురం పీ2), తాడిపత్రికి కావ్య (అనంతపురం డీ1), రాప్తాడుకు చంద్రానాయక్ (ముదిగుబ్బ), నార్పలకు ఎం.సుధాకర్ (ఎల్‌టీ మీటర్స్), అనంతపురంలోని మెటీరియల్ విభాగానికి చంద్రమోహన్‌రెడ్డి (అనంతపురం), అనంతపురం డీ1కు కోమల నాగవేణి (పుట్టపర్తి), అనంతపురం డీ4కు బి.రమాదేవి రాప్తాడు, అనంతపురం పీ2కు మురళీమోహన్ (అనంతపురం డీ4) బదిలీ అయ్యారు. కళ్యాణదుర్గంలో పనిచేస్తున్న శ్రీకాంత్‌కు అదే ప్రాంతానికి స్థాన చలనం కలిగించారు.

సచివాలయ ఉద్యోగి దుర్మరణం


బాలరాజు (ఫైల్)

పుట్లూరు: ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో సచివాలయ ఉద్యోగి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... పుట్లూరు మండలం కోమటికుంట్లకు చెందిన బాలరాజు (32)కు భార్య లావణ్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. వ్యవసాయంతో పాటు నార్పల మండలం గూగూడు సచివాలయంలో జూనియర్ లైన్‌మెన్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం ఉదయం తోటలో పని ముగించుకుని ట్రాక్టర్‌పై ఇంటికి వస్తుండగా గ్రామ శివారులోని చెరువు వద్దకు చేరుకోగానే నియంత్రణ కోల్పోవడంతో చెరువులోకి ట్రాక్టర్ దూసుకెళ్లి బోల్తాపడింది. ఆ సమయంలో బాలరాజు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వెంకట ప్రసాద్ తెలిపారు.

పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచండి

- డీఐజీ ఆర్‌ఎన్ అమ్మిరెడ్డి


సిబ్బందితో మాట్లాడుతున్న డీఐజీ అమ్మిరెడ్డి

కూడేరు: ప్రజా సమస్యలకు పరిష్కార మార్గం చూపి, గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పడం ద్వారా పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలని సిబ్బందికి డీఐజీ ఆర్‌ఎన్ అమ్మిరెడ్డి సూచించారు. 'కాఫీ విత్ మెన్' కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి ఆయన కూడేరు పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. చట్టబద్ధంగా పరిష్కరించ తగ్గ సమస్యలకు వెంటనే పరిష్కార మార్గం చూపాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సత్యనారాయణ, ఏఎస్‌ఐ రామానాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ఐచర్ - డ్రైవర్ మృతి

గుత్తి రూరల్: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఐచర్ ఢీకొన్న ఘటనలో ఓ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్ణాటకలోని తుమకూరుకు చెందని హేమంత్ (38) ఐచర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి లోడ్ తీసుకుని బెంగళూరుకు బయలుదేరాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత గుత్తి మండలం ఊబిచెర్ల సమీపంలోని జిల్లా సరిహద్దు పోతుదొడ్డి వద్దకు చేరుకోగానే ఎదురుగా ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఘటనలో ఐచర్ వాహనం అద్దం బద్దలు చేసుకుని రోడ్డుపై పడిన హేమంత్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కార్డియోపల్మోనరీ రిససిటేషన్ (సీపీఆర్)తో కోలుకునేలా చేసిన వైద్యులు.. తక్షణ మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి రెఫర్ చేశారు. చికిత్సకు స్పందించక సర్వజనాస్పత్రిలో శనివారం ఉదయం హేమంత్ మృతి చెందాడు. ఘటనపై గుత్తి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆరుగురు తహసీల్దార్లకు పోస్టింగ్

అనంతపురం అర్బన్: తహసీల్దార్ల బదిలీల్లో కొంత మార్పు చేసి ఆరుగురికి బదిలీ ఉత్తర్వులను కలెక్టర్ గౌతమి జారీ చేశారు. ఫారిన్ సర్వీస్ కింద డ్వామాకు కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.వి జయలక్ష్మి బదిలీ అయ్యారు. బెళుగుప్ప తహసీల్దారు ఈశ్వరయ్యశెట్టిని కలెక్టరేట్ సి.సెక్షన్ (మెజిస్టీరియల్) సూపరింటెండెంట్‌గా, అక్కడున్న డి.తిరుమలరెడ్డిని అనంతపురం ఆర్డీఓ కార్యాలయం ఏఓగా, శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దారు డి.నీలకంఠారెడ్డిని కేఆర్‌సీసీ తహసీల్దార్, స్పందన ఇన్‌చార్జ్‌గా నియమించారు. యాడికి తహసీల్దారు జి.అలెగ్జాండర్‌కు కలెక్టరేట్ ల్యాండ్ రిఫారమ్స్ తహసీల్దారుగా పోస్టింగ్ ఇచ్చారు. అనంతపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సి.విశ్వనాథ్‌కు యాడికి తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇస్తూ డిప్యూటేషన్‌పై కలెక్టరేట్‌కు నియమించారు.

6న దిశ కమిటీ సమావేశం

అనంతపురం టౌన్: ఈ నెల 6న జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు డ్వామా పీడీ వేణుగోపాలరెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, కలెక్టర్ ఎం.గౌతమి హాజరుకానున్న ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారుల హాజరు కావాలని పిలుపునిచ్చారు.

సంతానం కలగలేదని యువకుడి ఆత్మహత్య

పెద్దవడుగూరు: సంతానం కలగకపోవడంతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పెద్దవడుగూరు మండలం విరుపాపురం గ్రామానికి చెందిన నరేంద్ర (29)కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. సంతానం కలగలేదు. ఈ విషయంగా కుటుంబ సభ్యులతో చెప్పుకుని బాధపడేవాడు. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన చింత తోపులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

'గేట్స్'కు 'అటానమస్'



గుత్తి: పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారి పక్కనే గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా దక్కింది. ఈ మేరకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నుంచి శనివారం ఉత్తర్వులు అందాయి. పదేళ్ల పాటు గేట్స్‌కు ఈ హోదా ఉంటుంది. అటానమస్ హోదా దక్కడంపై ఆ కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ఎండీ రఘునాథరెడ్డి, డైరెక్టర్ వీకే వాణి, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు జేఎన్‌టీయూ అధ్యాపక బృందం సూచనలు, సలహాలు పాటించడం వల్లనే ఈ హోదా దక్కిందని ఈ సందర్భంగా గేట్స్ యాజమాన్యం పేర్కొంది.

క్లుప్తంగా

అనంతపురం రూరల్ ఏఓగా శశికళ



అనంతపురం సెంట్రల్: అనంతపురం రూరల్ మండల వ్యవసాయాధికారిగా శశికళ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఏఓ వెంకటేశ్వరప్రసాద్ రాప్తాడుకు బదిలీ అయిన విషయం విదితమే. నూతన ఏఓకు మండల వ్యవసాయశాఖ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో సత్యదేవుడి వ్రతాలు



పూజలు నిర్వహిస్తున్న అప్పాస్వామి

అనంతపురం కల్చరల్: నగరంలోని శివకోటి ఆలయం భక్తులతో పోటెత్తింది. శనివారం జేష్ఠ మాస పౌర్ణమిని పురస్కరించుకొని శివకోటి అప్పా స్వామీజీ నేతృత్వంలో రమాసమేత సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తులు బారులు తీరి భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఆలయంలో కొలువైన లలితకామేశ్వరి, మహాశివుడికి విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం మహా మంగళహారతి, అన్నప్రసాద వితరణ జరిగింది.

నేడు సంగీత కచేరి

అనంతపురం కల్చరల్: గాన గాంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఘంటసాల ఆరాధన సమితి ఆధ్వర్యంలో సంగీత కచేరీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పాలసముద్రం నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మూడో రోడ్డులోని ఘంటసాల భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు కచేరీ ఉంటుందన్నారు.

ముగిసిన ఇంటర్వ్యూలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఆరుగురు అసోసియేట్ ప్రొఫెసర్లకు కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (సీఏఎస్) కింద పదోన్నతులు కల్పించడానికి శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఫిజిక్స్, తెలుగు, ఫిజికల్ ఎడ్యుకేషన్, కంప్యూటర్ సైన్సెస్ లో ఒక్కొక్కరు చొప్పున, బయోటెక్నాలజీలో ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లకు ఇంటర్వ్యూలు జరిగాయి. గత పాలకమండలి నిర్ణయం మేరకు ప్రొఫెసర్ పదోన్నతులు కల్పించడానికి సీఏఎస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు.

బస్టాండ్ పరిశుభ్రతే ముఖ్యం

- ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల



ఆర్టీసీ సిబ్బందితో మాట్లాడుతున్న జోనల్ చైర్‌పర్సన్ మంజుల

అనంతపురం సెంట్రల్: బస్టాండ్ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. శనివారం ఆమె చాంబర్‌లో ఆర్టీసీ డిపో సిబ్బంది, శానిటేషన్ కాంట్రాక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. మంజుల మాట్లాడుతూ బస్టాండ్‌తో పాటు పరిసరాలు దుర్వాసన వస్తున్నాయని, ప్రభుత్వం రూ.లక్షలు నిధులు మంజూరు చేస్తున్నా కాంట్రాక్టర్‌తో పనులు చేయించడం సిగ్గుచేటన్నారు. అధికారుల తీరులో మార్పు రాకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అధికారులు, కాంట్రాక్టర్‌పై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. డిపో పర్యవేక్షించాల్సిన అధికారులు..ఇక్కడి పనులు తప్పా మిగిలిన పనులు చేస్తున్నారని స్టేషన్ మేనేజర్ మూర్తిపై మండిపడ్డారు. బస్టాండ్ ఆవరణలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి ఫిర్యాదులు వెళ్లాయన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ నాగభూపాల్, సూపరింటెండెంట్ శ్రీపాద తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

రాప్తాడురూరల్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఈనెల 5 నుంచి 9 వరకు ప్రాక్టికల్స్ జరగనున్నాయి. ఇందుకోసం నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 173 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

హైవే హోయి.. జామ పండ్లు రోయ్!

జాతీయ రహదారులపై వాహనాలు జోరుగా పరుగులు తీస్తుంటే.. పక్కనే తాజా జామ పండ్లు కనిపిస్తే ఆగి కొనుగోలు చేయకుండా ఎవరైనా ఉంటారా..? అనంతపురం– హైదరాబాదు హైవే పక్కన అక్కడక్కడ సీజన్ వారీగా పండ్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. సీజన్ కావడంతో తోట నుంచే తెచ్చిన తాజా జామ పండ్లను చిరువ్యాపారులు గార్లదిన్నె సమీపంలోని హైవేపై ఉంచి విక్రయిస్తున్నారు. జోరుగా వెళ్తున్న వాహనాలు.. స్పీడు బ్రేకర్ల వద్ద నెమ్మదించిన వెంటనే.. చిరువ్యాపారులు వాహనాలను సమీపించి, వాటిని విక్రయిస్తున్నారు. జామపండ్లు గిన్నె ధర రూ.50తో విక్రయిస్తున్నారు. ఇలా వ్యాపారం బాగుందని చిరువ్యాపారులు చెప్పున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విక్రయించి రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు సంపాదించుకుంటున్నట్లు చిరువ్యాపారులు, రైతు కూలీలు చెప్తున్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్, అనంతపురం



హైవే పక్కన బుట్టల్లో ఉంచిన జామపండ్లు



కారు వచ్చె.. సార్..సార్.. తీసుకోండి



తీసుకోండి ప్లీజ్..



డ్రైవరన్నా.. జామ పండ్లు తీసుకోన్నా...

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం క్రైం: ఎంపీ తలారి రంగయ్య శనివారం తన క్యాంపు కార్యాలయంలో పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్‌చెక్కులు పంపిణీ చేశారు. తాడిపత్రి గంగాదేవిపల్లికి చెందిన సునీత రూ.2.10 లక్షలు, తబ్జులకి చెందిన పాపక్క, లక్ష్మీదేవికు మంజూరైన రూ.1.20 లక్షలు ఎంపీ తలారి రంగయ్య వారి కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలోని డిస్ట్రిబ్యూషన్–5 సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ నాగరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని తపోవనం, సోమనాథ్‌నగర్, ప్రశాంతి నగర్, జనశక్తి నగర్, రంగస్వామి నగర్, యువజన కాలనీ, ఏఎస్ఆర్ నగర్, రాయల్ నగర్ తదితర కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

వైభవంగా సీతారామచంద్ర విగ్రహ ప్రతిష్ట

రాప్తాడు: ఎం.కృష్ణాపురంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారామచంద్ర స్వాముల విగ్రహ ప్రతిష్టను శనివారం ఉదయం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునే సీతారామ విగ్రహాలను వేద పండితులు ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన, బింబ కళాన్యాసాలు, ప్రాణ ప్రతిష్ట, కక్షాగ్నిజ్వాలి, కుష్మాండచ మహోదనబలి, పూర్ణాహుతి, కలశ ఉద్యాసన, మార్జనం, కుంభాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, రిటైర్డ్ జడ్జి కిష్టప్ప తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, బీసీ సెల్ నాయకులు పసుపుల ఆది, చిత్రా వెంకటేష్, వైఎస్సార్ సీపీ నాయకులు రవి, నిరంజన్, పసుపుల శేఖర్, రామచంద్రా రెడ్డి, చిరుతల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సీతారామచంద్ర స్వాముల విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

వైభవంగా కుంభాభిషేకం

ఆత్మకూరు: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి వాసవీమాత ఆలయంలో మూడు రోజులుగా శ్రీ మత్కన్యకాపరమేశ్వరి అమ్మవారి స్వర్ణోత్సవ మహా కుంభాభిషేకం నిర్వహించారు. శనివారం వాసవీమాతకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఈ పూజల్లో పాల్గొన్నారు. ప్రకాష్‌రెడ్డికి ఆర్యవైశ్య సంఘం సభ్యులు సన్మానించారు. ఆలయంలో నవగ్రహాలకు యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రాణప్రతిష్ట, బలిహరణ కక్షాగ్ని జ్వాల, మహా పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. అనంతరనం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు. పూజల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ నరసింహారెడ్డి, యూత్ లీడర్ గూలి కొండారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బాలపోతన్న, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, జిల్లా కార్యదర్శి వెంకట్రాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు తైదుల శివారెడ్డి, అంజినప్ప, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

టీడీపీ హయాంలో నగరం నాశనం

- మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరిపై మేయర్ వసీం ఆగ్రహం

అనంతపురం క్రైం: గత టీడీపీ ప్రభుత్వంలో వర్గపోరుతో నగరాన్ని నాశనం చేసిందెవరో చెప్పాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిని మేయర్ ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక మాజీ ఎమ్మెల్యే చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని మేయర్ వసీం అన్నారు. నగరంలోని లక్ష్మీనగర్ నాగులకట్ట వద్ద రూ.1.41 కోట్లతో జరుగుతున్న బీటీ రోడ్డు పనులను కమిషనర్ రమణారెడ్డితో కలసి మేయర్ పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో రోడ్డును ఏర్పాటు చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను మేయర్ ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి నగరాభివృద్ధి కోసం తాను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసినట్లు ప్రతిసారీ చెప్తుకుంటున్నారన్నారు. 2014 నుంచి 2019 వరకు బీజేపీతో అంటగాగిన మీరు.. అప్పట్లో ఎందుకు అభివృద్ధి చేయలేకోపోయారు చెప్పాలన్నారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అభివృద్ధిని చేతల్లో చూపించి, ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. తమ ప్రభుత్వంలో రూ.800 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనంతపురం నగరానికి ప్రత్యేకంగా రూ.25 కోట్లు నిధులు కేటాయించిన విషయాన్ని తెలియజేశారు. తమ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమ పాలనను చూసి ఆకర్షితులై టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి బాకే హబీబుల్లా చేరిన విషయాన్ని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో ఆ పార్టీలోని మైనార్టీలు టీడీపీను వీడడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ చింతకుంట మధు, నాయకులు ఖాజా, రఫీ, హిదయతుల్లా, తదితరులు పాల్గొన్నారు.



బీటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

అనంతపురం టౌన్: ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ శంకర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యావరణం - పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో కళాజాతా నిర్వహించారు. అనంతరం శంకర్‌రావు మాట్లాడుతూ గతంలో పట్టణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగం అధికంగా ఉండేదన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలన్నారు. అనంతరం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, పాతూరు మార్కెట్‌తోపాటు పలు ప్రాంతాల్లో కళాజాతా నిర్వహించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.



పర్యావరణ కాలుష్యంపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

క్యాజువాలిటీకి కుర్చీల వితరణ

అనంతపురం క్రైం: సర్వజనాస్పత్రి ఎమర్జెన్సీ వార్డుకు (క్యాజువాలిటీ)కి వచ్చే రోగుల సౌకర్యార్థం దివ్యశ్రీ ఆస్పత్రి యాజమాన్యం కుర్చీలు వితరణ చేశారు. శనివారం ఆస్పత్రి అధినేత డాక్టర్ రామ్మోహన్ దంపతులు 'గౌరవిద్దాం' అనే నినాదంతో ఏర్పాటు చేసిన చైర్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, ఆలంబన జనార్దన్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు బాలకృష్ణ, సద్వార్‌వలి, ఆనంద్, మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకందే సేవలపై జాప్యం తగదు

అనంతపురం క్రైం: ప్రజలకందే సేవలను జాప్యం చేస్తే ఏమాత్రం ఉపేక్షించేది లేదని కమిషనర్ రమణారెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ సేవలపై జాప్యం చేసిన రెవెన్యూ, సచివాలయ అడ్మిన్లకు కమిషనర్ జరిమానా విధించారు. రోజుకు రూ.50 జరిమానా విధించి, ఆ మొత్తాన్ని వారి జీతాల నుంచి వసూలు చేసేలా కమిషనర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ సిబ్బంది రాజేంద్రప్రసాద్ బాబుకు రూ.6,650, పీ వేణుగోపాల్ రూ.1,990, కే హర్షవర్ధన్‌రెడ్డి రూ.1,250, మురళీమోహన్ రూ.750, ప్రసాద్ రూ.500, పద్మలత రూ.400, సీ నారాయణస్వామి రూ.200, అడ్మిన్లు ములకేష్ రూ.550, వరలక్ష్మి రూ.350, ప్రభావతి రూ.350, వీరనారప్ప రూ.250, గ్రేస్ మృదుల రూ.150, రఘునాథ్‌కు రూ.50 విధించారు.

జాబ్‌చార్ట్‌ను అనుసరించాలి :

జాబ్‌చార్ట్‌ను విధిగా అనుసరించాల్సిందేనని, అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు తప్పవని కమిషనర్ రమణారెడ్డి పారిశుధ్య కార్యదర్శులను హెచ్చరించారు. శనివారం నగరపాలక సంస్థలో పారిశుధ్య కార్యదర్శులతో కమిషనర్ సమావేశమయ్యారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సావిత్రి, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్యదర్శులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ రమణారెడ్డి

గడువులోపు పరిష్కారం చూపాలి:

స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల ఫిర్యాదులకు గడువులో పరిష్కారం చూపాలని కమిషనర్ రమణారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థలో అధికారులతో సమావేశమయ్యారు. సమావేశంలో మేనేజర్ లక్ష్మీదేవి, అకౌంట్స్ అధికారి పద్మావతి, ఆడిట్ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కీర్తిని జాతీయ స్థాయిలో చాటండి

- డీవీఈఓ వెంకటరమణ నాయక్

అనంతపురం: న్యూఢిల్లీలో జరగనున్న హ్యాండ్‌బాల్ జాతీయ పోటీల్లో అద్భుతంగా ఆడి రాష్ట్ర కీర్తిని చాటి చెప్పాలని అనంతపురం డీవీఈఓ వెంకటరమణ నాయక్ ఆకాంక్షించారు. జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ అండర్–19 పోటీలకు వివిధ జిల్లాలకు చెందిన 16 మంది అమ్మాయిలు, 16 మంది అబ్బాయిలు ఎంపికయ్యారు. వారిలో అమ్మాయిల జట్టు నుంచి లావణ్య, లక్ష్మీప్రియ, భవ్యశ్రీ, గాయత్రీబాయి(అనంతపురం), వహీదా (కర్నూలు), ఉమామహేశ్వరి, రాఖీ, వెంకటశ్రావణకుమారి, సౌమ్యశ్రీ (ఏలూరు), మేఘన (తిరుపతి), సత్య(కృష్ణా), రషీదాబేగం, మౌనిక (ప్రకాశం), తోరణ (కాకినాడ), భార్గవి (విశాఖపట్నం), శ్రావణి (పశ్చిమ గోదావరి).

బాలుర జట్టు..:

రియాజ్, మారుతీ నాయక్, అభి (కర్నూలు), వినోద్ నాయక్, ఉదయ్‌కిరణ్, రూపేశ్, కుమార్, భానుప్రకాశ్ (అనంతపురం), పవన్‌కళ్యాణ్, రాముడు నాయక్ (విశాఖపట్నం), హర్షిత్ (విజయవాడ), కుమార్ (విజయనగరం), నరేంద్ర (ప్రకాశం), సాయికిరణ్(శ్రీకాకుళం), దీపేశ్ సత్య, అరవిందబాబు (కృష్ణా), జయసూర్య (నెల్లూరు), హేమంత్‌కుమార్ (ఏలూరు) ఎంపికయ్యారు. వీరంతా కలసి అనంతపురం రైల్వే స్టేషన్ నుంచి శనివారం న్యూఢిల్లీకి బయల్దేరారు. వీరికి డీవీఈఓ వెంకటరమణ నాయక్‌తో పాటు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, కోచ్‌లు గాయత్రి, మద్దిలేటి, మేనేజర్ శ్రీనాథ్ అభినందనలు తెలిపారు.



జాతీయ స్థాయి క్రీడలకు బయల్దేరిన రాష్ట్ర జట్టు

పవన్ ఎలిగెన్సీ నిర్మాణానికి భూమి పూజ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం: నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డు వద్ద పవన్ ఇన్‌ఫ్రా ఆధ్వర్యంలో పవన్ ఎలిగెన్సీ బహుళ అంతస్తు నివాస సముదాయం నిర్మాణానికి భూమి పూజ చేశారు. పవన్ ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ బోయపాటి సురేంద్ర మాట్లాడుతూ అనంతపురం ప్రజలు అందుబాటు ధరలో సొంతింటి కల నెరవేర్చుకోవడానికి ఇది సదవకాశం అన్నారు. నాణ్యత నిర్మాణ సామగ్రిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. అన్ని మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హతను బట్టి బ్యాంకు రుణ సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నందు రాజశేఖర్, అమృత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ తొక్కడం అలవర్చుకోవాలి



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ ఏ మల్లికార్జున రెడ్డి



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ట్రైనీ కలెక్టర్ కుశాల్‌జైన్

రాప్తాడురూరల్: రోజూ సైకిల్ తొక్కడం ఆరోగ్యంగా ఉంటారని ట్రైనీ కలెక్టర్ కుశాల్ జైన్ అన్నారు. ప్రపంచ సైకిల్ ర్యాలీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నగరూరు రసూల్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ట్రైనింగ్ కలెక్టర్ కుశాల్ జైన్ ర్యాలీని ప్రారంభించారు. జిల్లా వైద్య అధికారి డాక్టర్ వీరబ్బాయి మాట్లాడుతూ సైకిల్ తొక్కడం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎం అండ్‌హెచ్ఓ యుగంధర్, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.ప్రభాకర్ రాజు, కళాశాల కరస్పాండెంట్ పీఎల్ఎన్ రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ ఎస్. ఓబుల్‌రెడ్డి, డాక్టర్ మధుసూదన్ విద్యార్థులు పాల్గొన్నారు.

సైకిల్ తొక్కితేనే ఆరోగ్యం

అనంతపురం: ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కడం అలవాటు చేసుకోవాలని ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ ఏ మల్లికార్జున రెడ్డి అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్–4 , నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ డేను పురస్కరించుకొని సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి రెక్టార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నెహ్రూ యువకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోమశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చాగంటి రామిరెడ్డి, యూఎన్ఓ అవార్డు గ్రహీత, జిల్లా యువ అధికారి బీసాటి భరత్ పాల్గొన్నారు.

కల్యాణ మంటపంలో చోరీ యూపీవాసుల పనే

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగర శివారులోని నీలం రాజశేఖరరెడ్డి కల్యాణ మంటపంలో చోరీకి పాల్పడింది యూపీ వాసులేనని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. గురువారం జరిగిన ఈ చోరీపై నాల్గో పట్టణ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ప్రధానంగా సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగ ఆనవాళ్లను గుర్తించారు. ఫుటేజీల్లో లభించిన దొంగ చిత్రాన్ని గుర్తించిన పోలీసులు.. దాని ఆధారంగా దర్యాప్తును ముమ్మరం చేస్తున్నారు. రూ. 7.50 లక్షలు నగదుతో పాటు రెండు తులాలు బంగారు నగలను అపహరించుకెళ్లిన విషయం పాఠకులకు తెలిసిందే.

కల్యాణ మంటపాల్లో అప్రమత్తంగా ఉండాలి..

పెళ్లిళ్ల సీజన్ కావడంతో అన్ని కల్యాణ మంటపాల నిర్వాహకులను పోలీసులు అప్రమత్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ముఠాలు చోరీలకు తెగబడుతుండడంతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రతి కల్యాణ మంటపం లోనూ నిర్వాహకులతో కలిసి పోలీసులు అప్రమత్తం చేస్తున్నారు. విలువైన వస్తువులు, డబ్బు దగ్గర ఉంచుకున్న సమయాల్లో వాటి భద్రత కోసం గట్టి జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమానితులు తారస పడితే పోలీసులకు సమాచారం చేరవేయాలన్నారు. ప్రతి కల్యాణ మంటపంలో 100 డయల్ నంబరుతో కూడా హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు.



కల్యాణమంటపంలో చోరీకి పాల్పడిన వ్యక్తి చిత్రం

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్



బహుమతులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాప్తాడు: క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దండు రామాంజనేయులు, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ సంఘ సీఈఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన ఖోఖో వేసవి శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. సర్పంచు సాకే తిరుపాల్, హెచ్ఎం నరసింహులు, పీడీ ఎన్ కేశవ మూర్తి, పీడీ బి.రమేష్, కోచ్‌లు చిత్రా ఆదినారాయణ, తరుణ్, చైతన్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఒడిశా రైలు ప్రమాద మృతులకు నివాళి

అనంతపురం: ఒడిశా రాష్ట్రంలో జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్ద ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ప్రమాదంలో మరణించిన వారికి రూ.50 లక్షలు, గాయపడిన వారికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. రైల్వే ప్రమాదానికి బాధ్యత వహిస్తూ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ రాజీనామా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర అధికార ప్రతినిధి పులిరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెన్నీ మల్లికార్జున , సుధాకర్, శంకర్, ప్రదీప్, చంద్ర, నాగేంద్ర, అశ్వర్థ, ఎర్రిస్వామి, సుబ్బయ్య, మారన్న, అమర్, సోము తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం సిటీ: ఒడిశాలో జరిగిన రైళ్ల ప్రమాదంలో అసువులు బాసిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని అనంతపురం రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం ఎదుట కార్మికులు శనివారం నివాళులర్పించారు. సీపీఎం నగర అధ్యక్షుడు రామిరెడ్డి ఆధ్వర్యంలో మహిళలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు.

రైలు ప్రమాదంపై విచారణ జరిపించాలి

అనంతపురం అర్బన్: ఒడిశాలో జరిగిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేసింది. ప్రమాదంలో మరణించిన ప్రయాణీలకు ఆపార్టీ నాయకులు నివాళులు అర్పించారు. స్థానిక రైల్వే స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ రైలు ప్రమాదాలు జరగకుండా రూ.కోట్లతో ప్రారంభించిన 'భారత్ కా కవచ్' ఏమైందని ప్రశ్నించారు. రైలు ప్రమాదానికి ప్రధాని నరేంద్ర మోదీ నైతిక బాధ్యత వహించాలన్నారు. ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ చేయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ముస్కిన్, వెంకటనారాయణ, వలి, ప్రకాష్, మసూద్, రాజు, వరలక్ష్మి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

- జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్పీ కె. శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు – ఓనర్లు, డ్రైవర్లతో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించాలని, డ్రైవింగ్ లైసెన్సులు, ఆటో ఇన్సూరెన్సులు ఉండాలన్నారు. రాంగ్‌పార్కింగ్ లేదా రోడ్లపై ఎక్కబడితే అక్కడ ఆటోలు నిలపరాదన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయ భాస్కర్ రెడ్డి, అనంతపురం డీఎస్పీ జి.ప్రసాద్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ వెంకటేష్ నాయక్, జిల్లా వ్యాప్తంగా ఆటో డ్రైవర్ల యూనియన్లు – ఓనర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

